కష్టాల సాగులో నష్టాల దిగుబడి

- అతివృష్టి, అనావృష్టితో దెబ్బతిన్న పంటలు
- పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం



పచ్చగా ఉన్నా దిగుబడిలేని మినుము పంట

సింహాద్రిపురం : కోటి ఆశలతో ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులకు చివరకు అప్పులే మిగిలేటట్లు కనిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అనావృష్టి, పంటలు చేతికొచ్చే సమయంలో అతివృష్టితో పంటలలో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పంటలకు ఉచిత పంటల బీమా అందించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా ఉచిత బీమాను ఎత్తివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సింహాద్రిపురం మండల వ్యాప్తంగా 9800 హెక్టార్లలో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేయాల్సి ఉండగా.. ఖరీఫ్ ప్రారంభమైన తర్వాత వర్షాలు అదును దాటి పడటంతో దీంతో సాగు విస్తీర్ణం తగ్గింది. మండల వ్యాప్తంగా 6373 హెక్టార్లలో రైతులు పంటలను సాగు చేశారు.

అతివృష్టి, అనావృష్టితో దెబ్బతిన్న పంటలు

మండలంలో టమాట, మిరప, వేరుశనగ, మొక్కజొన్న, ఉద్దులు సోయాబీన్, మినుము, తదితర పంటలు సాగు చేశారు. ముందస్తు వర్షాలకు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడులు రాలేదు. దీంతో పంటలు సాగు చేసిన రైతులు ఆశలు వదులుకున్నారు. వర్షాలు పడిన తర్వాత సాగు చేసిన టమాట, వేరుశనగ, మొక్కజొన్న, మినుము, తదితర పంటలు ఆరంభంలో పైరు బాగానే ఎదిగింది. అయితే గత వారం, పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంటలు ఎర్రబడి, తెగుళ్లతో కాయలు రాలిపోయి దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు బోరు బావుల కింద సాగు చేసిన అరటి, చీనీ, ఉల్లి పంటలకు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లి, మిరప తదితర పంటల సాగుకు ఎకరాకు లక్ష రూపాయలు, పత్తి, వేరుశనగ, మినుములు ఆముదం పంటల సాగుకు ఎకరాకు కూడా దాదాపు రూ.70 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం అతి వృష్టి, అనావృష్టితో పంటల సాగులో దిగుబడులు తగ్గుతుండటంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతోపాటు రైతులు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది.

పంటల సాగు విస్తీర్ణం తగ్గిన విషయం వాస్తవమే



ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు వర్షాలు ఆలస్యంగా రావడంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గిన విషయం వాస్తవమే. ఖరీఫ్ పంటల సాగుకు ఈనెల 30వ తేదీవరకు గడువు ఉందని, రైతులు జొన్న, కంది పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. అలాగే వర్షాలతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ముఖ్యంగా రైతులు పైరు సాలల్లో వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షం తగ్గిన వెంటనే 17:17:17 లేదా 19:19:19 మందులను పిచికారి చేస్తే పంట యథాస్థితికి వస్తుందన్నారు.

– కళ్యాణ్ కుమార్, మండల వ్యవసాయాధికారి, సింహాద్రిపురం

మళ్లీ నష్టాలే మూటగట్టుకున్నాం



నాకున్న 2 ఎకరాల పొలంలో మినుము పంటను సాగు చేశారు. వారం రోజుల క్రితం ఎడ తెరిపి లేకుండా వానలు కురిశాయి. దీంతో మినుము పంట తెగుళ్లతో ఎర్రగా మారిపోయింది. మళ్లీ మూడు రోజుల నుంచి వర్షాలు పడుతున్నాయి. బాగున్నా మినుము పంటలో దిగుబడి తగ్గిపోయింది. పంట బాగుంది అప్పులు తీరుతాయనుకున్నాం. కానీ దిగుబడి చూస్తే ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మళ్లీ నష్టాలే మూటగట్టుకున్నాం.

– జమాల్, మినుము రైతు, సింహాద్రిపురం

మొక్క జొన్న పంటలో దిగుబడి తగ్గింది



ఖరీఫ్ సీజన్‌లో అరకొర పదునులో మొక్కజొన్న పంటను సాగు చేశాను. ప్రస్తుతం మొక్క జొన్న పంట ఏపుగా పెరిగింది. మంచి దిగుబడి వస్తుందని కోటి ఆశలు పెట్టుకున్నా. అకాల వర్షంతో మొక్క జొన్న పంటలో కంకిపొట్ట వస్తున్నప్పుడు వర్షం దాటికి మొక్కజొన్న కంకినలిగిపోయి దిగుబడి తగ్గిపోయింది. దీంతో మొక్కజొన్న పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు.

– డి.కిశోర్‌కుమార్‌రెడ్డి, మొక్కజొన్న రైతు, సింహాద్రిపురం

నీటి కొరత లేకుండా చేస్తాం



నూతన బోరు పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నీటి కొరత లేకుండా చేయడమే లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక అహోబిలాపురం పాఠశాల సమీపంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతన బోరు ఏర్పాటు చేస్తున్నారు. ఈ బోరు పనులను వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక న్యాక్ అకాడమిలో శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ మాట్లాడుతూ ప్రతినెలా జిల్లా, నియోజకవర్గాలలో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఈ జాబ్ మేళాకు 226 మంది హాజరు కాగా.. 114 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, న్యాక్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్ రెడ్డి తెలిపారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మి కిడ్నీ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ సౌజన్య చర్మ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రికార్డుల తనిఖీ

కొండాపురం : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బిల్లులు చేసిన రికార్డులను అకస్మికంగా శుక్రవారం డీఎల్‌డీవో రామాంజనేయులు తనిఖీ చేసినట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శానిటేషన్ తాగునీటిపై ఆరా తీశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను క్షుణంగా పరిశీలించారు.

జిల్లా పరిషత్ హైస్కూల్‌కు లక్ష వితరణ



గంగనపల్లె హైస్కూల్‌కు రూ.లక్ష వితరణ చేస్తున్న ఆర్.వి.రమణ

పెండ్లిమర్రి : మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు శుక్రవారం ఆర్.వి.టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి.రమణ క్రీడా సామగ్రికి రూ.లక్ష నగదు పాఠశాల హెచ్‌ఎం ఇక్బాల్‌కు అందజేశారు. క్రీడాకారుల క్రీడల కొరకు ఏఅవసరం వచ్చిన సహాయం చేస్తానన్నారు. వితరణ చేసిన రమణను విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శేషాచలపతి



వీరపునాయునిపల్లె : స్థానిక మండల అభివృద్ధి అధికారిగా శేషాచలపతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాజుపాలెం మండల నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఎంపీడీఓగా అధనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన పదోన్నతిపై చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

యూరియా పంపిణీ పరిశీలన

ముద్దనూరు : యూరియా పంపిణీని శుక్రవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి, సీఐ దస్తగిరిలు పరిశీలించారు. యూరియా స్టాకు, పంపిణీలో అవకతవకలు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల మేరకే యూరియా పంపిణీ చేయాలన్నారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరుగ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హుస్సేన్ భార్య మాజీ సర్పంచ్ మస్తాన్‌బీ(58) అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కడప నగర ఈస్ట్ జోన్ అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



వల్లూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో

వల్లూరు : ప్రజలు తమ గృహాలతోపాటుగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారిణి ఓబులమ్మ అన్నారు. వల్లూరులో జరుగుతున్న చెత్త సేకరణ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిణి మైధిలితో కలిసి ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాస్యత అన్నిటికన్నా విలువైంది

వేంపల్లె : ప్రపంచ సంపదలన్నింటి కంటే అక్షరాస్యత ఎంతో విలువైందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవ ముంగిపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా డిజిటల్ అక్షరాస్యతతో సంపూర్ణత సాధించేలా ప్రయత్నించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు

వేంపల్లె : మండల వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సాధ్యం కానీ ఆదేశాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యాలయ ఏఓ శ్రీనివాసులును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సమస్యలకు కారణమవుతున్న మనమిత్ర డోర్ టు డోర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉద్యోగుల పిలుపుమేరకు విధులను బహిష్కరిస్తున్నామన్నారు. ఈనెల 5వ తేదీన అధికారికంగా విడుదల చేసిన ఆదేశాలకు సంబంధించి మిత్ర డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్ విధులు నిర్వహించడానికి క్లస్టర్ మ్యాపింగ్ చేయడానికి ఆదేశాలు రావడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాణాంతక వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల రూరల్ : ప్రాణాంతక వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ శాంతికుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఎస్‌బీఐ కాలనీ సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. దోమకాటువల్ల వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయని, దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికాంత్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, ఆరోగ్య విస్తరణాధికారి సతీష్‌కుమార్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

వల్లూరు(చెన్నూరు) : నేటి సమాజంలో యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని చెన్నూరు సీఐ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ×పోలీసు కళా జాగృతి బృందం ఇన్‌చార్జ్ జి.నరసరామ్, వారి బృందం ఆధ్వర్యంలో ఓ యువతా మేలుకో నాటక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో మత్తు పదార్థాల వాడకం వల్ల ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యలు, అనర్థాలు, సమాజంలోని రుగ్మతలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ సుబ్రమణ్యం, కాలేజీ చైర్మన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి

పులివెందుల టౌన్ : రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్‌కు తక్షణమే చైర్మన్‌ను నియమించాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించి వెంటనే రూ.2 వేల కోట్ల నిధులను కేటాయించాలన్నారు. ఈ నిధులతో రైతులకు, విద్యార్థులకు, వ్యాపార వర్గాల వారికి ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. ఈ నిధులను కేటాయిస్తే ఆర్‌సీడీఎస్ అభివృద్ధితోపాటు రాష్ట్ర ప్రగతికి కూడా మేలు జరుగుతుందన్నారు. ఈనెల 20వ తేదీనుండి 25వ తేదీవరకు రాష్ట్ర వ్యాప్తంగా మండల, డివిజన్, డివిజన్ స్థాయిలలో అధికారులకు వినతి పత్రాలను అందించనున్నట్లు తెలిపారు.

భిక్షాటన చేస్తూ మృతి చెందిన వ్యక్తికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న అభి చైర్మన్ విజయ్ తదితరులు

కమలాపురం : ఐదు రోజులు క్రితం మృతి చెంది, పురుగులు పట్టిన మృత దేహానికి అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలోని వికలాంగుల కాలనికి చెందిన షేక్ మౌలాలి (78) కొంత కాలంగా భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న అతడు ఐదు రోజుల క్రితమే మృతి చెందాడు. శుక్రవారం దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగు వారు చూసి ట్రస్ట్ చైర్మన్‌కు సమాచారం అందించారు. ట్రస్ట్ సభ్యులతో కలసి విజయ్‌బాబు అక్కడికి చేరుకున్నాడు. పురుగులు పట్టిన శవాన్ని చూసి చలించి పోయాడు. సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించాడు. దీంతో స్థానికులు అతడికి కృతజ్ఞతలు తెలియజేశారు.

యూరియా కోసం రైతుల తిప్పలు

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరు మండలంలో పంటలు సాగు చేసిన రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా వరి పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. శుక్రవారం మండలంలో యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలుసుకున్న రైతులు అధిక సంఖ్యలో చెన్నూరులోని మన గ్రోమోర్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. కేంద్రం తెరవక పోవడంతో చాలా సేపు నిరీక్షించారు. చివరకు వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియాను పంపిణీ చేశారు. వచ్చిన స్టాకు కొద్ది సేపటికే ఐపోవడంతో మిగిలిన రైతులకు నిరాశ మిగిలింది.

భవనంపై పడిన పిడుగు



స్లాబ్‌కు పడిన రంధ్రం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని దిగువపట్నంలో ఓ ఆర్ఎంపీ డాక్టర్ నిర్మిస్తున్న నూతన భవనంపై శుక్రవారం సాయంత్రం పిడుగు పడింది. స్లాబ్‌కు రంధ్రం పడింది. అలాగే కాలనీలోని కొన్ని ఇళ్లలో విద్యుత్ బల్బులు, టీవీలు కాలిపోయాయని స్థానికులు తెలిపారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



పి.మాధవరావు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ శాఖ అధ్యాపకుడిగా పనిచేస్తున్న పి.మాధవరావుకు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ గ్రంథాలయ శాఖ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలోని డాక్టర్ కె.సురేంద్రబాబు పర్యవేక్షణలో యూజ్ ఆఫ్ పిరియాడికల్స్ బై ది ఫ్యాకల్టీ అండ్ రీసెర్చ్ కలర్స్ ఇన్ ఆంధ్ర అండ్ ఎస్.వి.యూనివర్సిటీ లైబ్రరీస్ ఏ స్టడీ అనే అంశంపై ఈ పరిశోధన గ్రంథంలో అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు ఏ అంశాలపై పిరియాడికల్స్‌ను ఉపయోగిస్తారనే విషయంపై విశ్లేషణాత్మకంగా పరిశోధన చేశారు. ప్రిన్సిపల్ నాగేంద్ర హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కర్తవ్యే దైవం, డ్యూటీ ఈజ్ గాడ్ (ఇంగ్లీష్)అనే అంశాలపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాఠశాలలోని 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు విజేతలను ఎంపిక చేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి 1వ, 2వ, 3వ బహుమతులను ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు గోల్డ్ మెడల్‌తోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీలు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయలసీమపై కూటమి ప్రభుత్వానికి బాధ్యత లేదా

పులివెందుల టౌన్ : రాయలసీమపై కూటమి ప్రభుత్వానికి బాధ్యత లేదా అని పీసీసీ డెలిగేట్ వి.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు సాగు, తాగునీరు అందించ లేదని, రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు గడిచినా రాయలసీమ తన న్యాయమైన నీటి వాటా దక్కించుకోలేకపోయిందన్నారు. రాయలసీమకు సాగు నీరు అందేలా సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని పోరాటాలు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకునే వారే లేక ప్రభుత్వాల్లో చలనం లేదన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు 44 శాతం నీటిని అందిస్తూ రాయలసీమ పంట పొలాలకు కేవలం 9 శాతం నీటిని అందించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా రాయలసీమలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల మీద దృష్టి పెట్టి పూర్తి చేయాలన్నారు.

ప్రయాణికులతో చలగాటం

పులివెందుల రూరల్ : ఆర్టీసీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులోని బస్టాండు వద్ద ప్రయాణికురాలు బస్సు దిగకముందే బస్సు ముందుకు వెళ్లడంతో ఆమె కిందపడిపోయింది. ప్రయాణికులు బస్సు దిగారా లేదా అని చూసుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లపై ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికులు దిగేంత వరకు బస్సులను ఆపి దిగిన తర్వాత బస్సులు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

డ్రైవర్లు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

సింహాద్రిపురం : ప్రభుత్వం ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లకు త్వరలో ఆర్థిక సాయం అందిస్తోందని, ఆ ఆర్థిక సాయం కోసం వాహనాల డ్రైవర్లు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డ్రైవర్ల ఆర్థిక సాయం కార్యక్రమాన్ని జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ అమలు చేస్తోందని, ఈనెల 17వ తేదీ నుంచి అన్ని గ్రామ, వార్డు సచివాలయాలలో కొత్త దరఖాస్తులను స్వీకరిస్తారని, 19న కొత్త లబ్ధిదారుల నమోదుకు అనుమతిస్తామన్నారు. ఈనెల 22వ తేదీలోపు ఫీల్డ్ వెరిఫికేషన్లు పూర్తి చేసి ఈనెల 24వ తేదీన తుది జాబితా, అక్టోబర్ 1న సీఎం చేతులమీదుగా ఆర్థిక సాయాన్ని విడుదల చేస్తారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చింతకొమ్మదిన్నె : కడపలోని స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14, 17 జిల్లాస్థాయి బాలబాలికల స్విమ్మింగ్ పోటీలలో అండర్-17 బాయ్స్ స్విమ్మింగ్‌లో ఏ.ఈశ్వర్, జి.మనోజ్, అండర్-14 సైక్లింగ్ బాయ్స్‌లో జస్వంత్‌కుమార్‌రెడ్డి, గర్ల్స్‌లో బీబీ, మరియుం విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అంగడివీధి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు.

ఉల్లి కొనుగోలు తక్షణం చేపట్టాలి

కమలాపురం : ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఉల్లి దిగుబడుల కొనుగోలును తక్షణం ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఉల్లి కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బంది ఎవరూ లేక పోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కమలాపురంలో ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి క్వింటా రూ.1200 మద్దతు ధరతో ఉల్లి కొనుగోలు చేస్తున్నామని, ఉల్లి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ ప్రకటించినప్పటికి మార్క్‌ఫెడ్ సిబ్బంది ఒక్కరూ కూడా లేక పోవడం విచారకరం అని వారు ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెప్పిన మాటను అమలు పరిచే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీరపునాయునిపల్లె మండలంలోని ఉల్లి రైతులు పంట నూర్పిళ్లు చేపట్టారని, దిగుబడులు నిల్వ ఉంచుకునే సదుపాయాలు లేక పోవడంతో రైతులు ఉల్లి కొనుగోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కమలాపురంలో అన్ని రైళ్లు ఆపాలి

కమలాపురం : రేణిగుంట-గుంతకల్లు రైల్వే లైన్‌లో భాగంగా కమలాపురం రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కరోనా కంటే ముందు కమలాపురం రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లకు స్టాపింగ్ ఉండేదన్నారు. ప్రస్తుతం వెంకటాద్రి, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రమే కమలాపురంలో స్టాపింగ్ ఉందన్నారు. అలాగే ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన నంద్యాల డెమోతో పాటు హుబ్లీ ప్యాసింజర్ రైళ్ల మాత్రమే ఆపుతున్నారని తెలిపారు. కరోనాకు ముందు హరిప్రియ, మెయిల్, దాదర్, చెన్నై ఎగ్మోర్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ ఆపేవారని ఆయన గుర్తు చేశారు. కొండాపురం, రాజంపేట, కోడూరు రైల్వేస్టేషన్‌లలో ఈ రైళ్లన్నింటికి స్టాపింగ్ ఉందన్నారు. రైల్వే అధికారులు స్పందించి కమలాపురం రైల్వే స్టేషన్‌లో కరోనాకు ముందు ఆపే రైళ్లన్నీ ఆపాలనీ లేని పక్షంలో దశల వారీ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పారిశుద్ధ్యం, నీటి సరఫరాలపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య

ఎర్రగుంట్ల : మండలంలోని గ్రామాలలో పారిశుద్ధ్య చాలా అధ్వనంగా ఉందని, అలాగే నీటి సమస్య కూడా ఉందని వాటి పరిష్కారాలపై దృష్టి పెట్టాలని ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో సర్వసభ్య సమావేశం ఉప మండలాధ్యక్షుడు మల్లు వెంకటమోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య మాట్లాడుతూ గ్రామాలలో దోమల బెడదతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి సమావేశంలో విద్యుత్ లైన్ల సమస్య ఉందని తెలుపుతున్నా ఎలాంటి స్పందన లేదన్నారు. చిలంకూరు ఎంపీటీసీ కొండయ్య మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం చాలా అధ్వనంగా ఉందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోలేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని వెంటనే కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. పోట్లదుర్తి ఎంపీటీసీ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలలోని నీరంత తాగునీటి పైపులైన్‌లో వస్తుందన్నారు. ఎంపీడీవో వెంకటరమణయ్య మాట్లాడుతూ వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు



ఎన్‌సీసీ శిబిరంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చింతకొమ్మదిన్నె : ఇటీవల ఎక్కువ మోసాలు సైబర్ క్రైమ్ రూపంలోనే జరుగుతున్నాయని అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు తెలియజేయరాదని సైబర్ క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని 35వ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ 30. ఎన్‌సీసీ ఆంధ్ర బెటాలియన్ శిబిరంలో కల్నల్ మోనిస్ సహకారంతో సైబర్ క్రైమ్, సోషల్ మీడియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు మానసికంగా ధైర్యంగా ఉండి వెంటనే సైబర్ క్రైమ్ సెల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి ఓటీపీ అడిగే అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకులు ఎప్పుడూ అటువంటి కాల్స్ చేయవని ఆయన సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ లేదా సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేస్తే పోలీస్ శాఖ వెంటనే స్పందిస్తుందన్నారు. అనంతరం సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లు విడుదల చేయడంతో పాటు ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేకంగా సైబర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు.